# నిశ్శబ్ద రాగం

నిజాన్ని కప్పిపుచ్చడం వల్ల ఒక్కోసారి చక్కని అవకాశం చేజారిపోతుందన్న విషయం అనుభవ పూర్వకంగా తెలుసుకున్నాడు భుజంగరావు. జరిగిపోయిన తప్పిదాన్ని తలచుకుంటూ తనని తాను ఎన్నిసార్లు నిందించుకున్నాడో లెక్కలేదు. అంతా అయిపోయాక అనుకుని ఏం లాభం? చేతులారా కూతురి భవిష్యత్తును బుగ్గి చేశాడు. ఉన్నమాట చెప్పివుంటే ఈ పాటికి తన కూతురు ఇల్లాలై వుండేది. కన్నతండ్రై వుండి ఆమెకు తీరని ద్రోహం చేశాడు. బిడ్డకా సంగతి తెలిస్తే క్షమిస్తుందా? ఉహు... గతించిన సంఘటనలు కళ్లముందు కదలాడసాగాయి.

★ ★ ★

"ఆఫీసరు గారు పిలుస్తున్నారు"

అటెండరు పిలుపుతో సీట్లోంచి లేచాడు భుజంగరావు.

"ఈ హీజ్ మిస్టర్ రజనీకాంత్. మన ఆఫీసులో జూనియర్ అసిస్టెంట్‌గా అపాయింటయ్యారు" పరిచయం చేశాడు ఆఫీసరు.

'నమస్తే' నమ్రతగా చేతులు జోడించాడు రజనీకాంత్.

భుజంగరావుని అనుసరించాడు, రజనీకాంత్.

రజనీకి పాతికేళ్లుంటాయి. చదువు సంస్కారాలతో పాటు చక్కని పర్సనాలిటీ వుంది.

అతడిని చూడగానే భుజంగరావు మదిలో ఏదో ఆశ. తన కూతురు పక్కన అతడిని ఊహించుకుని 'భలేజోడి' అనుకున్నాడు. అందులోనే 'ప్చ్' అనుకుని నిట్టూర్చాడు.

ఇంటివద్ద పని చేద్దామని పట్టుకెళ్ళిన ఫైలు మరునాడు ఆఫీసుకు పట్టుకుని రావడం మరచిపోయాడు భుజంగరావు.

విషయం గ్రహించిన రజనీకాంత్ "మీ ఇల్లు ఎక్కడో చెప్పండి క్షణంలో మోపెడ్ మీద వెళ్ళి తీసుకొస్తాను" అన్నాడు చిరునవ్వుతో.

అడ్రస్ చెప్పాడు భుజంగరావు.

రివ్వున బయలుదేరాడు రజనీకాంత్.

కాలింగ్‌బెల్ మ్రోగడంతో తలుపు తెరిచిందో అందాల భరిణ.

ఆ మగువను చూడగానే రజనీకాంత్ కళ్లు జిగేల్‌మన్నాయి. కొన్ని క్షణాలు అతడి చూపులు ఆమెపై స్థంభించిపోయాయి. చూడముచ్చటైన ముఖవర్చస్సు. అద్భుతమైన చిత్రకారుడి చేతిలో దిద్దుకున్న బంగారు బొమ్మలా వుందామె.

'నన్ను రజనీకాంత్ అంటారు. మీ నాన్నగారు నేను ఒకే ఆఫీసులో పని చేస్తున్నాం. ఆయన మరచిపోయిన ఫైలు..." స్వపరిచయం చేసుకుంటూ విషయం వివరించాడు. రజనీకాంత్.

అతడి మాట పూర్తికాకుండానే మెరుపుతీగలా లోపలికెళ్లి ఫైలు పట్టుకొచ్చింది.

కాసేపు అక్కడే వుండమని మనసు పీకుతున్నా అందుకు ఆమె అవకాశం ఇవ్వకపోవడంతో వెనుదిరిగాడు రజనీకాంత్.

భుజంగరావుకి మెరుపుతీగ లాంటి అమ్మాయి వుందన్న సంగతి ఆ రోజు వరకు తెలియదతడికి. ఏనాడు ఆయన తన కుటుంబ విషయాలు ప్రస్తావించలేదు. పెద్దలు పెళ్లికి తొందర చేస్తూ ఉంటే ఈ మధ్య సెలవు మీద ఊరెళ్లినపుడు రెండు మూడు సంబంధాలు చూశాడు. అయితే ఏ పిల్లా నచ్చకపోవడంతో పెళ్లి చూపులంటే విసుగు పుట్టింది. పెళ్లిచూపులనేవి సహజంగా వుండాలే తప్ప టైము డేటు ఫిక్స్ చేసి ఎదురెదురుగా కూర్చుని చూసుకునే సాంప్రదాయం మారాలనుకున్నాడు. ఆ రాత్రంతా అతడి అంతరంగం చుట్టూ భుజంగరావు అమ్మాయే పరిభ్రమించిందది.

★ ★ ★

ఆదివారం

ట్రిమ్‌గా తయారై వీధిన పడ్డాడు రజనీకాంత్. సెలవురోజున స్టేడియంలోకెళ్లి టెన్నిస్ ఆడటం అతడికి అలవాటు. ఆరోజు ఎందువల్లో ఆటకెళ్లాలనిపించలేదు. అప్రయత్నంగా అతడి కాళ్లు భుజంగరావుగారి ఇంటివైపు దారి తీశాయి.

రజనీకాంత్‌ను చూసి లోపలికి రమ్మన్నాడు భుజంగరావు.

"ఏమిటీ పొద్దున్నే బయలుదేరావు. టెన్నీస్‌కా?"

"ఊ హూం...ఆ..." తడబడుతున్నాయి అతడి మాటలు.

నవ్వుకున్నాడు భుజంగరావు.

కొన్ని క్షణాలు నిశ్శబ్ధం.

తిరిగి భుజంగరావే ఆఫీసు సంగతులు మాట్లాడటం ప్రారంభించాడు. ఊ కొడుతున్నాడు రజనీకాంత్. అయితే అతడి కళ్లు మాత్రం గతంలో చూసిన మెరుపుతీగ కోసమే ఆత్రంగా అన్వేషిస్తున్నాయి.

కాసేపటికి అతడి ఆశ ఫలించింది.

కాఫీకప్పులతో ప్రత్యక్షమైందామె.

"మా అమ్మాయి దీప" కాఫీ కప్పు రజనీకాంత్‌కి అందిస్తూ అన్నాడు భుజంగరావు.

చేతులు జోడిస్తూ చిరునవ్వు నవ్వింది దీప.

ఎంత మనోజ్ఞంగా వుందా నవ్వు? నవ్వేటప్పుడు సొట్టలు పడే ఆ నున్నటి బుగ్గలు అతడి గుండెల్ని పిండిచేశాయి. ప్రతినమస్కారం చేశాడు రజనీకాంత్.

దీప ఇంట్లోకి వెళ్ళిపోయింది.

ఆమె గురించి ఏమైనా చెబుతాడేమో అనుకుంటే మళ్లీ ఆఫీసు విషయాలు మొదలెట్టాడు భుజంగరావు. చిరాకనిపించింది రజనీకాంత్‌కి.

లోపలికెళ్లిన దీప ఎంతకూ బయటకు రాకపోవడంతో వస్తానంటు లేచాడు.

సెలవు రోజుల్లో భుజంగరావు ఇంటికెళ్లేవాడు రజనీకాంత్. తన కూతురునని చేసుకుంటావా? అని అడుగుతాడేమోనని అతడి అంతర్గత ఆశ. ఎంతకూ అతడి నోటినుంచి ఆ మాట రాకపోవడంతో తనకు తానుగా బయటపడ్డాడు రజనీకాంత్.

"సారీ మిస్టర్ రజనీకాంత్. మా అమ్మాయికి ఇప్పుడప్పుడే పెళ్లిచేయను. అది ఇంకా చదువుకుంటుంది" సమాధానం చెప్పి టాపిక్ మార్చాడు భుజంగరావు.

అతడామాటలు అంటున్నప్పుడు దీప వంక చూశాడు రజనీకాంత్. చిన్నబోయినట్లుందామె ముఖం. ఎర్రకలువల్లా తయారయ్యాయి ఆమె నయనాలు. రజనీకాంత్ ఎదపై సుత్తిదెబ్బ పడ్డట్లయ్యింది. మరి మాట్లాడకుండా లేచాడు.

★ ★ ★

ఊరినుంచి వచ్చిన రజనీకాంత్ సరాసరి భుజంగరావుగారి దగ్గరకెళ్లి విష్‌చేస్తూ "నాకు మ్యాచ్ సెటిలయ్యింది. మీరు తప్పకుండా నా పెళ్లికి రావాలి"అన్నాడు.

"అలాగే లేవోయ్" అన్నాడు భుజంగరావు తలైనా పైకెత్తకుండా.

"అమ్మాయి ఎలా ఉంటుందని అడగరేం?"

"ఎలా వుంటుంది" పేలవంగా ఉంది భుజంగరావు ప్రశ్న.

"అవిటిదైనా ఎంతో అందంగా ఉంటుంది సార్"

"అవిటిదా?" భృకుటి ముడిచాడు భుజంగరావు.

"అయితే ఏవండీ. ఆమెది అగ్గిలాంటి గుణం. స్వచ్ఛమైన సంస్కారం. విశిష్టమైన వంశం. పైగా నా మనసును దోచుకున్న మనోహరి. అందుకే మరి వెనక్కి తిరగి చూడకుండా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేశాను." అని చెప్పి తన సీట్లోకెళ్లిపోయాడు.

భుజంగరావు మదిలో ఇప్పుడు అలజడి ప్రారంభమైంది. రాస్తున్న ఫైలు ఆపేసి చుట్టూ చూశాడు.

స్టాపంతా ఎవరి పనిలో వారున్నారు.

చేస్తున్న పనిమీద మనసు లగ్నం కావడం లేదు. ఆలోచనలు అతడి మస్తిష్కాన్ని తొలిచేస్తున్నాయి. ఇక అక్కడ వుండబుద్ధికాక సెలవుపెట్టి ఇంటికి వెళ్లిపోయాడు. ఇంటికెళితే మాత్రం ఆలోచనలు ఆగుతాయా? ఉహు...మా పని మేం చేస్తూనే వుంటామంటున్నాయి.

కూతురు పెళ్లి కోసం తాను చేసిన ప్రయత్నం గుర్తుకు వచ్చింది. పుత్తడి బొమ్మలా పుట్టించిన దీపకి మాట రాకుండా ఎందుకు చేశాడో ఆ భగవంతుడు తెలియదు. తన బిడ్డ మూగదవడంతో ఆమె మెడలో తాళి కట్టడానికి ఎవ్వరూ ముందుకు రాలేదు. రజనీకాంత్ కూడా అందరిలాంటి వాడే అనుకున్నాడు. అందుకే అతడి ముందు తన అమ్మాయి మూగదని బహిర్గతం చేయడమిష్టం లేక పెళ్లి చేయనని అబద్ధమాడాడు. ఒక అవిటి అమ్మాయికి జీవితం ప్రసాదించేంత మంచితనం, మానవత్వం అతడిలో వున్నాయని ఇప్పుడే తెలుసుకున్నాడు. ఆ

విషయం ముందుగా ఊహించి ఉంటే తను వాస్తవాన్ని మరుగున పరిచి వుంచేవాడు కాదు. దీప అంటే ప్రాణం పెట్టే రజనీకాంత్ ఆమె మాటలురాని బొమ్మని తెలిసినా చేపట్టి వుండేవాడు. అయితే ఇప్పుడు ఆ అవకాశం చేజారిపోయింది. గడపలోకొచ్చిన సంబంధాన్ని తానే గెంటేసుకున్నాడు. తండ్రిగా ఆమెకు చేసిన ద్రోహం క్షమించరానిది. గతించిన రోజు మళ్లీ తిరిగొస్తే ఎంత బాగుణ్ను. జరిగిపోయిందాని గురించి ప్రతిక్షణం మధనపడటం తప్ప చేయగలిగిందేమి లేదనుకున్నాడు.

అంతలో ఏదో అలికిడైతే అటుగా దృష్టి సారించాడు భుజంగరావు.

రజనీకాంత్ వస్తున్నాడు.

ఎందుకు?

తన తప్పిదాన్ని మళ్లీ గుర్తుకు చేయడానికా? జరిగిందానికి పశ్చాత్తాప పడుతున్న భుజంగరావుకి అతడి రాక గోరుచుట్టు మీద రోకలి పోటయింది.

"భుజంగరావుగారూ! మీరీ రోజు ఎందుకు సెలవుపెట్టి వచ్చారో నాకు తెలుసు"

రజనీకాంత్ మాటలకు కళ్లు పెద్దవి చేశాడు భుజంగరావు.

"మీరు ఆశీర్వదిస్తే దీప మూగవీణ కాదు. శృతిచేసిన వీణే అవుతుంది. మా ఇరువురి మౌనరాగాన్ని తాళి బొట్టుతో బంధించేందుకు అనుమతి ఇప్పించండి"

అర్థింపుగా వున్నాయి అతడి మాటలు.

జాలిగొలుపుతున్నాయి అతడి చూపులు.

క్షణం క్రితం విన్నదంతా అబద్ధం అంటోంది అతడి మనసు.

కలా? నిజమా? చేయి గిచ్చుకున్నాడు.

అప్రయత్నంగా అతడి కళ్లనుంచి రెండు నీటిబొట్లు జాలువారాయి.

అవి అశృవులు కావు. వారి పెళ్లికి అక్షింతలు.

**(23 ఫిబ్రవరి, 1997 ఆంధ్రభూమి డైలి)**